ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ 'ఐ రాస్తే'కు ప్రపంచగుర్తింపు

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'ఐరాస్తే' ప్రాజెక్టుకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవలే ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్(ఐఆర్‌ఎఫ్) వార్షిక సంవత్సర పుస్తకం-2023లో ప్రచురించారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని అప్లైడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సెంటర్(ఐఎన్‌ఏఐ) ప్రాజెక్టుగా 'ఐరాస్తే' గుర్తింపు పొందింది. ప్రమాదాలు జరిగే రహదారులపై బూడిద, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించడానికి డేటా విశ్లేషించబడుతుంది. ప్రస్తుతం భారతదేశంలో 350 వాహనాలతో పెద్ద ఎత్తున ఏడీఏఎస్ ఆధారిత రహదారి భద్రతా ప్రాజెక్టుగా కొనసాగుతోంది.

శ్రీవారికి పుష్పాలంకరణ



హఫీజ్‌పేట్: వేంకటేశ్వరస్వామి అష్టవింశ బ్రహ్మోత్సవాలలో భాగంగా అష్టోత్తర శత కలశాభిషేకంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు సంకల్పము, అష్టోత్తర శత కలశాభిషేకం, 10.30 గంటలకు సామూహిక కుంకుమార్చన, మధ్యాహ్నం 12.00 గంటలకు హారతి ఇచ్చారు. 1 గంటకు అన్నప్రసాద వితరణ బాలకృష్ణ నాయుడు, రాజ్యలక్ష్మిలు చేశారు. సాయంత్రం ఐశ్వర్య లక్ష్మీహోమం, మహదాశీర్వచనము సింహ వాహనసేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యాటక పరవశం



దుర్గం చెరువు వద్ద 4.2 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్

- దుర్గం చెరువు.. ప్రతి రోజు బోటింగ్‌కు 500 మంది, సెలవురోజుల్లో 1400 మంది
- వాకర్స్, పార్కును సందర్శించే వారు రోజుకి 800 మంది. శని, ఆదివారాల్లో 2వేలకు పైగా..





పార్కులో ఏర్పాటు చేసిన వివిధరకాల చెట్లు

మాదాపూర్: దుర్గం చెరువుకు సందర్శకులు రోజురోజుకు పెరుగుతున్నారు. రోజు 700 నుంచి 800 వరకు వాకర్స్, సందర్శకులు వస్తున్నారు. ఇక శని, ఆదివారాల్లో దాదాపు 2వేలకు పైగా సందర్శకులు వస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చిల్డ్రన్స్ పార్కు, వాటర్ ఫౌంటేన్, లవ్ సింబల్ తదితరాలు ఆకట్టుకుంటున్నాయి.

- ఐటీ ప్రాంతం కావడంతో ఉద్యోగులు సేద తీరేందుకు ఆసక్తి చూపుతున్నారు
- రోజు సాయంత్రం 7 గంటల నుంచి రా.10 గంటల వరకు వాటర్ ఫౌంటేన్ మూడు షోలు వేస్తున్నారు.
- సందర్శకులు తిలకించేందుకు వీలుగా స్టేజీని ఏర్పాటు చేశారు.
- దుర్గం చెరువు వద్ద ప్రత్యేక ప్రాంతాలను ఏర్పాటు చేశారు. బర్త్‌డేలు, చిన్నచిన్న కార్యక్రమాలను చేసుకోవడానికి ఆయా ప్రాంతాలను బుక్ చేసుకోవచ్చు.
- దుర్గం చెరువు ప్రధాన ద్వారం వద్ద వివిధ రకాల విగ్రహాలు, వివిధ దేశాలకు చెందిన చెట్లను పెంచుతున్నారు. వాటి ప్రత్యేకతను తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేశారు.
- జపాన్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా తదితర దేశాల నుంచి బోన్సాయ్ చెట్లను సందర్శకులు చూసేందుకు అందుబాటులో ఉంచారు.
- 4.2 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. సీనియర్ సిటిజన్‌లు సైతం వాకింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బోట్లు

- పెడల్ బోటింగ్, స్పీడ్ బోటింగ్,డీలక్స్ బోటింగ్, రెస్టారెంట్ బోటింగ్
- పెడల్ బోటింగ్ వ్యక్తికి రూ.50. నలుగురు రైడ్ చేసేందుకు వీలుగా ఉంటుంది. రైడ్ సమయం 30 నిమిషాలు.
- స్పీడ్ బోటింగ్ వ్యక్తికి రూ.100. బోట్‌లో నలుగురు ప్రయాణించవచ్చు. సమయం 6 నిమిషాలు.
- డీలక్స్ బోటింగ్, వ్యక్తికి రూ.50.ఇందులో 20 మంది కూర్చునే అవకాశం ఉంటుంది. సమయం 10 నిమిషాలు
- రెస్టారెంట్ బోటింగ్ వ్యక్తికి రూ.200.ఇందులో 30 మంది కూర్చోవచ్చు. సమయం 30 నిమిషాలు.





ప్రవేశం ఫీజు	వ్యక్తికి రూ.10
పిల్లలకు	రూ.5
నెలసరి వాకర్స్ పాస్	రూ.200
సంవత్సర వాకర్స్ పాస్	రూ. 2000
సీనియర్ సిటీజన్స్ వాకర్స్ పాస్	రూ. 800
స్టిల్ కెమెరా ఫొటోషూట్ (పర్ డే)	రూ. 250,
వీడియో కెమెరా షూటింగ్ (పర్‌డే)	రూ.5000
ఫిల్మ్ షూటింగ్ (పర్‌డే)	రూ. 25,000

మూడో రోజు.. 5 నామినేషన్లు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మూడో రోజు ఐదుగురు నామినేషన్లు వేశారు. ముగ్గురు ఇండిపెండెంట్లు, ఎంసీపీఐ(యు), ఇండియన్ ప్రజా పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం నామినేషన్ల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గుంజి వాసు, జువ్వా ఫణి కుమార్, సయ్యద్ సాబేర్, ఇండియన్ ప్రజాపార్టీ నుంచి సలాడి దుర్గా ప్రసాద్, ఎంసీపీఐ(యు) అభ్యర్థిగా తుడుం అనిల్ కుమార్ నామినేషన్ల పత్రాలు ఆర్‌ఓకు అందజేశారు. సోమవారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

పటాన్‌చెరులో ఐదు..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో సోమవారం ఐదు నామినేషన్‌లు దాఖలయ్యాయి.అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడా రెయిన్ బో మెడోస్‌కి చెందిన గట్టు సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే ముత్తంగికి చెందిన కొత్త బలిజ బస్వరాజ్ తెలంగాణ ప్రజాశక్తి పార్టీ నుండి.. రామచంద్రాపురం ప్రభాసం డైనమిక్ ఎంక్లేవ్-1 నుండి కాత్యాయని కుంభ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన మరమునిశ్రీశైలం యాదవ్ అలియాస్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్ పార్టీ నుండి ఒక్కటి, మరొకటి స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్‌లు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి దేవుజకు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు, ఆత్మీయ సమావేశాలు



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం, హుడాకాలనీ, సుభాష్‌నగర్, శాంతినగర్ కాలనీలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మాజీ కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీలో..



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఇంటింటి ప్రచారం

మియాపూర్: ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి మద్దతుగా మియాపూర్ డివిజన్ సుభాష్‌చంద్రబోస్‌నగర్ కాలనీలో.. కారు గుర్తుకే ఓటేద్దాం .. బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిద్దామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో గల పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు.. సామాన్యులకు ఇబ్బందులు



రెవెన్యూ, ఎంఈఓ కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో ఆగిపోయిన మహిళలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కార్యాలయం పరిసరాల్లో ఎన్నికల నిబంధనలతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. శేరిలింగంపల్లి ఆర్‌ఓ కార్యాలయం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఉన్న విషయం తెలిసిందే. అదే భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో శేరిలింగంపల్లి సర్కిల్-20 కార్యాలయం ఉంది. ఆర్‌ఓ కార్యాలయం పక్కనే శేరిలింగంపల్లి తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాలు ఉన్నాయి. ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డు నుంచే ఈ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంది. సర్కిల్ కార్యాలయానికి వచ్చే సామాన్యులకు మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతి లేదని 100 మీటర్ల బారికేడ్ల వద్ద నుంచే పోలీసులు తిరిగి పంపిస్తున్నారు. పలు అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరుతున్నారు.

అభివృద్ధి వివరిస్తూ.. కరపత్రాలతో ప్రచారం

శేరిలింగంపల్లి/రాయదుర్గం: ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి మరోసారి అవకాశం ఇవ్వాలంటూ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా నల్లగండ్ల, రాయదుర్గంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. గత 9 ఏళ్ల కాలంలో చేసిన అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గణేష్ ముదిరాజ్, నరేష్, అంజమ్మ, సంపత్, నారాయణ, అనిల్‌సింగ్, జగదీష్, శ్రీనివాస్, మధు విజయలక్ష్మీ, కార్యకర్తలు పాల్గొన్నారు

ఎన్‌ఎస్‌యూఐ అభ్యర్థులు వీరే..

హెచ్‌సీయూ విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐ ఒంటరి పోరు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని విద్యార్థి సంఘం 2023-24 ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించినట్లు ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ ఎన్నికల ఇన్‌చార్జీలు రచనారెడ్డి, సీఎం సునీల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కోఆర్డినేటర్ దాసరిరాజు అజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకటనర్సింగ్‌రావు, రాష్ట్ర ఇన్‌చార్జీ అక్షయ్‌లక్రాతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నామని వారు ప్రకటించారు. ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నుంచి అధ్యక్ష పదవికి అమల్‌జోష్ ఫిలిప్, ఉపాధ్యక్షుడుగా ముకుంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్‌యాదవ్, జాయింట్ సెక్రటరీగా చందన్‌దావర్, కల్చరల్ సెక్రటరీగా శ్రీద, క్రీడల కార్యదర్శిగా మహ్మద్ నద్రన్‌వి పోటీ చేస్తారని వారు ప్రకటించారు.

'ఐఎస్‌బీ' రోబోటిక్స్ స్టార్టప్‌కు చేయూత

ముందుకొచ్చిన మురుగప్ప గ్రూప్ సీడ్ ఫండ్

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) మెంటర్‌గా ఉండే రోబోటిక్స్ స్టార్టప్‌నకు చేయూత ఇచ్చేందుకు మురుగప్ప గ్రూప్ అనుబంధ సంస్థ నుంచి నిధులు కేటాయించనున్నారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో వ్యవసాయ రోబోటిక్స్ స్టార్టప్ ఎక్స్‌మిషన్స్, కోరమండల్ ఇంటర్నేషనల్ నుంచి సీడ్ ఫండింగ్ అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఐ వెంచర్-ఐఎస్‌బీ డైరెక్టర్ సౌమ్యకుమార్ మాట్లాడుతూ ఎక్స్‌మిషన్స్ స్టార్టప్‌నకు సీడ్ ఫండింగ్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్స్‌మిషన్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ తివిక్రమ్ కుమార్ డోగ్గా మాట్లాడుతూ వ్యవసాయంతో ఆటోమేషన్‌ను అనుసంధానం చేస్తున్నామన్నారు. ఇది నేటి, రేపటి రైతులకు సౌకర్యవంతంగా, లాభదాయకంగా ఉంటుందన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



నాయకులను కలిసిన మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం. భిక్షపతి యాదవ్ అన్నారు. సోమవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో పలువురు సీనియర్ నాయకులను ఆయన ప్రత్యేకంగా కలిసి పార్టీకి మద్దతివ్వాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బొల్లేపల్లి సీతారామరాజు, నరసింహాచారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలి

హఫీజ్‌పేట్: ప్రజలు అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చందానగర్ డివిజన్ పరిధిలోని సత్య ఎన్‌క్లేవ్ కాలనీలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గెలిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఆగకూడదంటే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రసాద్, వెంకట్‌రెడ్డి, రజనీకాంత్, శ్రీకాంత్, రాజశేఖర్, భవాని, యశ్వంత్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

కథక్ డ్యాన్స్ వర్క్‌షాప్





కథక్ నృత్య ముద్రలను చూపుతున్న అర్పితా బెనర్జీ

రాయదుర్గం: కథక్ నృత్య ప్రదర్శన విద్యార్థులు, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకుంది. గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో సోమవారం కథక్ డ్యాన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. రూట్స్ టు రూట్స్ ఇన్ సంస్థ ద్వారా ప్రఖ్యాత కథక్ కళాకారిణి అర్పితా బెనర్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె విద్యార్థుల ముందు విభిన్న నృత్య ముద్రలను ప్రదర్శించింది. ఇందులోని ప్రాథమిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులు 25 మందికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 24 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ.3 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

కారు గుర్తుకే ఓటేద్దాం..



వివేకానందనగర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో కార్పొరేటర్ రోజాదేవి సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అంతకు ముందు సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇంటింటికి తిరుగుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, నాయినేని చంద్రకాంత్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మరింత బలం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సపానదేవ్

పటాన్‌చెరు: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ సపానదేవ్ చేరికతో బీఆర్‌ఎస్ పార్టీకి పటాన్‌చెరు నియోజకవర్గంలో మరింత బలం చేకూరిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన ఆయన నివాసానికి సోమవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వారిద్దరూ చర్చించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై నమ్మకంతో టీడీడీపీ మాజీ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపానదేవ్ బీఆర్‌ఎస్‌లో చేయడం సంతోషకరమన్నారు. వారి అనుభవం ప్రజలకు, పార్టీకి ఎంతో సహకరిస్తుందన్నారు. అనంతరం సపానదేవ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని దశాబ్ద కాలంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించడానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ముదిరాజుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అధిక మొత్తంలో నిధులు కేటాయించడంతో పాటు ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. సమావేశంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకుడు దశరథ్‌రెడ్డి, బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.

ప్రచారంలో కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాల్గొనడం విశేషం. ఎమ్మెల్యే సతీ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

మణి గూడెం యాదమ్మ మహిపాల్‌రెడ్డి, కుమార్తె కోలాన్ రాజేశ్వరి చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న కోడలు పల్లవి విక్రమ్ రెడ్డి, తమ్ముడి కుమారులు గూడెం సంతోష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి ప్రతి రోజు వివిధ గ్రామాలు, కాలనీలలో ఇంటింటి ప్రచారం చే స్తున్నారు. పదేళ్ల గా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేయాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్టీలోకి 200 మంది యువకులు..

పటాన్‌చెరు: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నియోజకవర్గంలో కారు ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి సీనియర్ నాయకులు, యువకులు, కార్యకర్తలు వందలాదిగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. ఆదివారం రాత్రి పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సమావేశాల్లో చిట్కుల్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు దస్తగిరి హనుమంతు, రవి యాదయ్య, వెంకటేష్, ముత్తంగి గ్రామ పరిధిలోని డీఎస్ కాలనీకి చెందిన కాలనీ వాసులు, పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు రాకేశ్ తదితరులు తమ బృందాలతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని రూ.9 వేల కోట్లతో అభివృద్ధి చేశానని, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామని తెలిపారు. మూడోసారి కూడా విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, చిట్కుల్ ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, మాణిక్య ప్రభు, శ్రీధర్ చారి, మేరాజ్ ఖాన్, ఆంజనేయులు, దుర్గయ్య, వెంకటేశ్, భుజంగం, వీరాస్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పదేళ్లుగా జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రచార సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, యువకులు, మహిళలు అడుగడుగునా ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో జరిగిన సమావేశంలో తెల్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నవారి జైపాల్ రెడ్డి, కొల్లూరు గ్రామానికి చెందిన బోడ సుధాకర్, రమేశ్ రాములు, బిక్షపతి, లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం, అంబేద్కర్ యూత్, తండావాసులు సుమారు 500 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో అసత్యాలను చెబుతూ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. పార్టీలో చేరిన కార్యకర్తలు అందరూ సమష్టి కృషితో పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, బాబ్జి, నాగరాజు, కొమరయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం , శ్రీ పాల్, జ్యోతి శ్రీకాంత్‌రెడ్డి, చిట్టి ఉమేష్, మాజీ ఎంపీటీసీ నరసింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెటిలర్స్ అభివృద్ధి లక్ష్యంగా..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ప్రతి ఒక్కరి సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్‌లో జరిగిన రాయలసీమ, ఆంధ్ర యాదవుల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి నిండు మనసుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి, కుటుంబ సభ్యులు



యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూన్న మహిపాల్ రెడ్డి

ఆరు గ్యారంటీలతో.. కాంగ్రెస్ ప్రచారం



గోకుల్ ప్లాట్స్‌లో ప్రచారం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్, సాయినగర్ తండాలో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న 6 గ్యారంటీలను ప్రజలకు వివరించారు. అనంతరం వివిధ కాలనీ, బస్తీవాసులు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరిన మహిళలు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందగర్ డివిజన్ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్‌లోని మహిళలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. జగదీశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని అన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.